క్లుప్తంగా

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి



దాచేపల్లి: ఉపాధ్యాయవృత్తి ఎంతో పవిత్రమైందని ఎంఈఓ పినాకపాణి అన్నారు. బ్రహ్మనాయుడు ఆడిటోరియంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పప్పుల హరీ పెరల్సన్ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పెరాల్సన్ దంపతులను సన్మానించారు. ఎంఈఓ పినాకపాణి మాట్లాడుతూ... పెరాల్సన్ ఉపాధ్యాయుడిగా ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.స్వరూపదేవి, షేక్ కామర్జహన్, షేక్ మల్లికా తాజ్, రాఘవేణి పాల్గొన్నారు.

పురాతన వృక్షాలను కాపాడుకుందాం



కారెంపూడి: పురాతన వృక్షాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వన అభివృద్ధి, అడవుల పెంపకం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కొమెర అంకారావు(జాజి) పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న పురాతన వృక్షాలను పరిశీలించారు. ఒప్పిచర్ల చెరువు కట్టపై ఉన్న పురాతన మర్రి చెట్లను పరిశీలించి గుర్రప్ప అనే మేకల కాపరి వీటిని నాటడం వలన గుర్రప్ప చెట్లుగా పిలుస్తున్నారన్నారు. గ్రామాలలో మర్రి, రావి, వేప, కానుగ చెట్లు గ్రామాలు స్వచ్ఛమైన వాతావరణంలో ఉండడానికి కారణమన్నారు. వీటిని మరింతగా గ్రామాలలో అభివృద్ధి చేసుకోవాలని కోరారు. రోడ్డు పక్కల ఉన్న చెట్లను అకారణంగా కొట్టేస్తున్నారని అలాంటి చర్యలకు ఎవరూ పాల్పడవద్దన్నారు.

కారెంపూడి టీచర్‌కు తెలుగు తేజం పురస్కారం



కారెంపూడి: స్థానిక ఎంపీపీ స్కూల్(మెయిన్)లో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న బాణవత్ మాన్‌సింగ్ నాయక్‌కు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నరసరావుపేటకు చెందిన శ్రీ కళా వేదిక ఆదివారం పురస్కారం ప్రదానం చేసింది. నరసరావుపేటలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు తెలుగు తేజం పురస్కారాన్ని మాస్టారుకు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు, శ్రీ కళావేదిక అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కుమార్ చేతుల మీదగా పురస్కారాన్ని అందుకున్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథుడు

గురజాల: వినాయక చవితి పండుగ పురస్కరించుకుని గణనాథుడి నిమజ్జన వేడుకలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. రంగా సెంటర్‌లోని గణనాథుడు, అపార్టుమెంట్‌లోని గణనాథుల నిమజ్జన వేడుకలు నిర్వహించారు. తొలుత గణనాథులకు ఆయా కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఆలంకరించిన వాహనంపై గణనాథులను ఉంచి మేళాతాళలతో, డీజే పాటలతో యువత కేరింతల నడుమ నిమజ్జనానికి తరలించారు. నడికుడి లోని పొందుగుల కృష్ణానదిలో నిమజ్జన వేడుకలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



అచ్చంపేట: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక, పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీల ఆధ్వర్యంలో అచ్చంపేటలో భగవద్గీత ప్రాముఖ్యతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇందూ ధర్మ భగవద్గీత గ్రంథాలను ఇంటింటా పంపిణీ చేశారు. స్థానిక విద్వాన్ హైస్కూలులో కమిటీ సభ్యులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చర్చ నిర్వహించారు. భూమి మీద అవతరించిన మహోన్నత వ్యక్తే శ్రీకృష్ణ భగవానుడని చెప్పారు. పూర్వం కృష్ణాష్టమి వేడుకలను 11 రోజులపాటు నిర్వహించి వినాయక చవితి రోజు ముగించేవారని చెప్పారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీల అధ్యక్షులు కటకం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, సభ్యులు కె.అరుణ, కె.కార్తీక్, నారాయణమ్మ, అనూరాధ, వెంకటలక్ష్మి, శ్రీని, వీరయ్య, రాఘవ, సుందరం, రామాంజనేయులు, గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

వరి, మిరప పంట సాగు పనులు రైతులు ముమ్మరంగా చేపట్టారు. వర్షాలకు సాగర్ డ్యాం కళకళలాడుతోంది. కాలువలకు పుష్కలంగా నీరు సరఫరా చేస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దీనిలోభాగంగా మండలంలోని పంట పొలాల్లో వరి సాగుపై రైతులు దృష్టి సారించారు. మెట్ట ప్రాంతాల్లో మిరప నారు సాగు చేశారు.

– పిడుగురాళ్ల



ఏపుగా పెరిగిన వరి నారుమళ్లు



వరి నాట్లు వేస్తున్న మహిళలు



మిరప నారు వేస్తున్న రైతులు, కూలీలు



వరినాట్లు వేసిన పొలాలు

తక్కువ లోతు నీటిలో పెద్ద బొమ్మలను నిమజ్జనం చేయవద్దు

కారెంపూడి: వినాయక విగ్రహాలను తక్కువ లోతున్న నీటి కాల్వల్లో నిమజ్జనం చేయడం వల్ల విగ్రహాలు బయటకు కన్పిస్తున్నాయి. పైగా పంట కాల్వలు కావడంతో ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించిన విగ్రహాలు నిమజ్జనం అనంతరం కూడా కళ్లెదుటే కన్పిస్తున్నాయి. దీంతో నిమజ్జనానికి అర్థం లేకుండా పోతోంది. భక్తులను ఆవేదనకు గురిచేస్తోంది. పెదకొదమగుండ్ల బ్రాంచి కాల్వలో అలాగే రామాపురం మేజర్ కాల్వలో ఆదివారం రెండు బొమ్మలు మునిగే నీరు లేక పైకి కన్పించాయి. వాస్తవంగా చిన్న బొమ్మలు మట్టి వినాయక ప్రతిమలను మాత్రమే చిన్న కాల్వల్లో పెద్ద బొమ్మలను సాగర్ కుడి కాల్వలో నిమజ్జనం చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే మండలంలో వినాయక నిమజ్జనోత్సవాలు ఆదివారం కూడా వైభవంగా కొనసాగాయి. పూజా మండపం నుంచి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి వినాయకుని లడ్డూ ప్రసాదాలను వేడుకగా పాటలు నిర్వహించారు. వేలం ద్వారా వచ్చిన



పీకేజీ మేజర్ కాల్వలో నిమజ్జనం చేసిన వినాయకుని బొమ్మ బయటకు కన్పిస్తున్న దృశ్యం

డబ్బును ఉత్సవ కమిటీ మరుసటి ఏడాది ఉత్సవాలకు వాడుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తీన్‌మార్ వాయిద్యాలతో యువకుల విన్యాసాల నడుమ విగ్రహాల ఊరేగింపులు జరిగాయి. ప్రసాదాలు పంచుకుంటూ భక్తుల హారతులు పూజలందుకుంటూ ఉత్సవ ఊరేగింపులు కొనసాగాయి. అనంతరం సాగర్ కుడి కాల్వలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ

కారెంపూడి: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి పాలెపోగు జోసెఫ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్, వివిధ హోదాల పార్టీ నాయకులు బొమ్మిన అల్లయ్య, జాన్‌పాల్ నాయక్, బొంకూరి నాగేశ్వరరావు తదితరులు జోసెఫ్ స్వగ్రామం చింతపల్లి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గురజాలకు అగ్నిమాపక కేంద్రం మంజూరు

గురజాల: మండలానికి ఎట్టకేలకు అగ్నిమాపక కేంద్రం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గురజాల ప్రజల కోరిక దీంతో నెరవేరనుంది. పట్టణంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా మొన్నటి వరకు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న పిడుగురాళ్ల, 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాచర్ల నుంచి అగ్నిమాపక కేంద్రం వచ్చి మంటలు ఆర్పే పరిస్థితులు ఉండేవి. ఆ వాహనాలు వచ్చే సమయానికి ప్రమాదంలో ఆస్తి నష్టం, ఇతరత్రా నష్టాలు సంభవించేవి. ఈ విధంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమీపంలో చిన్న చిన్న ఫ్యాక్టరీలు, ఆఫీసులు ఉన్నాయి. అంతేకాక రోజురోజుకు పట్టణం విస్తరిస్తుంది. జనాభా పెరుగుదల కనిపిస్తుంది. ఈ పరిస్థితుల్లో గురజాలకు అగ్నిమాపక కేంద్రం ఆవశ్యకత ఉంతో ఉందని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలు విన్నపాల మేరకు ప్రభుత్వం స్పందించి అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేశారు. ఇందుకోసం స్థల సేకరణ చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. స్థలం సిద్ధమైతే సంబంధిత ఫైర్ శాఖ అధికారులు అగ్నిమాపక కేంద్రంకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

నిధులు మంజూరు..

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయుటకు నిధులు మంజూరు చేసినట్లు సమాచారం. గురజాలలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే రెంటచింతల, దాచేపల్లి, కారంపూడి మండలాలకు కేంద్ర బిందువుగా గురజాల ఉంటుంది. ప్రమాదం జరిగిన వెంటనే వెళ్లి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు చేపట్టవచ్చు.

భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు

దాచేపల్లి: వినాయకుడి విగ్రహాల వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణపురంలోని రెడ్ల బజార్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినాయకుడి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను రూ.35 వేలకు షేక్ ఖాసుమల్లి దక్కించుకున్నాడు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గొట్టం అంజిరెడ్డి, మందపాటి రమేష్ రెడ్డి, బి.విజయ్ కుమార్ రెడ్డి, మైలా మల్లారెడ్డి, పల్లె సమరసింహారెడ్డి, పల్లె వెంగళ్ రెడ్డి, గుర్రం రవీంద్రా రెడ్డి, గాజుల గోవిందరెడ్డి పాల్గొన్నారు. దాచేపల్లి, నడికుడి, ఇరికేపల్లిలో ఏర్పాటు చేసిన వినాయకుడి



నారాయణపురం లోనే రెడ్ల బజార్ లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న

విగ్రహాల వద్ద ప్రత్యేకంగా పూజలు జరిగాయి. నగర పంచాయతీ పరిధిలోని మన్సూర్షా పేట లో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రతిభా అవార్డు అందుకున్న నరసింహారావు

పిడుగురాళ్ల: గుంటూరు పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన్ మందిరంలో నిర్వహించిన సర్వేపల్లి రాధా కృష్ణన్ ప్రతిభా అవార్డులో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు చింతల నరసింహారావు అవార్డు అందుకున్నట్లు నరసింహారావు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు హాజరై అవార్డులను ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న చింతల నరసింహారావును తోటి ఉపాధ్యాయులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు అభినందించారు. కార్యక్రమంలో ఫౌండర్ అండ్ చైర్మన్ నాగయ్య, పల్నాడు జిల్లా అధ్యక్షులు రాము తదితరులు ఉన్నారు.



మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు నుంచి అవార్డు అందుకుంటున్న చింతల నరసింహారావు

కొలిక్కిరాని యూరియా సమస్య

కారెంపూడి: మండలంలో యూరియా కొరత ఇంకా కొనసాగుతూనే ఉంది. వరి నాట్లు ప్రారంభమైన 20 రోజుల నుంచి ఈ పరిస్థితి అలాగే ఉంది. మిగతా ఎరువులన్నీ ఎమ్మార్పీకే దొరకుతుండగా యూరియా అందుబాటులో లేకుండాపోయింది. ఎక్కడన్నా ఉన్నా కట్ట రూ.450 ధర పలుకుతోంది. గత శని, ఆదివారాలు కూడా ఈ ధరకే యూరియా దొరికింది. దాదాపు అన్ని షాపుల్లో యూరియా లేదంటున్నారు. ఎక్కడన్నా ఉంటే ఇదీ పరిస్థితి. సోమవారం కాని మంగళవారం కాని యూరియా లోడులు రావచ్చని రైతులకు సమాధానం ఇస్తున్నారు. కారెంపూడి నుంచి పక్క రాష్టానికి యూరియా అక్రమంగా తరలిస్తున్న ఘటన వెలుగు చూసినా ఇంకా ఇక్కడ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఎక్కడన్నా యూరియా నిల్వలున్నా ధర మాత్రం శనివారం కూడా కట్ట రూ.450 పలికింది. నాటు వేసిన తర్వాత డీఏపీలో కలిపి చల్లుకోవాలన్నా లేదా మిగతా ఏ కాంప్లెక్స్ ఎరువులు వేయాలన్నా యూరియా కాంబినేషన్‌తోనే రైతులు వేస్తారు. అలాగే కలుపు నివారణ మందులు వేయాలన్నా యూరియాలో కలిపి చల్లుకుంటారు. అందుకు యూరియాకు డిమాండ్. అందులోనూ కేంద్ర ప్రభుత్వం భారీగా సబ్సిడీ ఇచ్చే ఎరువు పైగా రూ.270కే చౌకగా దొరికే ఎరువు యూరియా ఒక్కటే. ధర తక్కువ కనుక పేద రైతులు ఎక్కువగా యూరియా పైనే ఆధారపడుతుంటారు.

సమాజ నిర్దేశకులు గురువులు

సత్తెనపల్లి: సమాజ నిర్దేశకులు గురువులేనని విఖనస మండలి ఉపాధ్యక్షుడు గుడిపూడి తులసికృష్ణ భట్ట అన్నారు. నరసరావుపేటలోని మున్సిపల్ బాలుర పాఠశాలలో ఆర్ట్స్ ఉపాధ్యాయుడిగా గత 35 సంవత్సరాలుగా పనిచేస్తూ ఆదివారం పదవీ విరమణ పొందిన వేదాంతం కోదండ రామాచార్యులు (రాంబాబు) సన్మాన మహోత్సవంలో భాగంగా సత్కరించి మెమెంటో అందించారు. ఈ సందర్భంగా తులసికృష్ణ భట్ట మాట్లాడుతూ ఉపాధ్యాయులు రోజులో మూడో వంతు సమయాన్ని విద్యార్థులతో గడుపుతారని, ఆ సమయంలో వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తారన్నారు. బోధనలో మంచి నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులను విద్యార్థులు ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటారన్నారు. ఈ సందర్భంగా వేదాంతం కోదండ రామాచార్యులు సేవలను పలువురు కొనియాడారు. అనంతరం ఆయనను సత్కరించి మెమెంటో అందించారు. కార్యక్రమంలో విఖనస మండలి బాధ్యులు నల్లూరి శ్రీనివాస్, నారాయణ లక్ష్మీనారాయణ, పుసులూరి సంపత్‌కుమార్, పెద్దింటి ఫణికృష్ణ, వేదాంతం రామకృష్ణమాచార్యులు, వేదాంతం శ్రీనివాస్, వేదాంతం భార్గవనాథ్, వేదాంతం విజయ నసింహాచార్యులు, వేదాంతం కృష్ణచైతన్య పాల్గొన్నారు.



వేదాంతం కోదండ రామాచార్యులును సత్కరించి మెమెంటో అందిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

నాదెండ్ల: గొర్రెల మందపైకి కారు దూసుకెళ్లిన ఘటనలో గొర్రెల కాపరి మృతి చెందాడు. ఎస్‌ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి నూతన బైపాస్ రోడ్డుపై కావూరు అండర్‌పాస్ వద్ద సర్వీసు రోడ్డులో వేగంగా వెళ్తున్న కారు గొర్రెలమందపైకి దూసుకెళ్ళింది. ఈ ఘటనలో గొర్రెల కాపరి ఆవుల శ్రీనివాసరావు (45) తీవ్ర గాయాల పాలవటంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉత్సాహంగా గణేష్ నిమజ్జన వేడుకలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను ఆదివారం నిమజ్జన వేడుకలు నిర్వహించారు. పలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాలను మేళతాలాలతో, భారీగా బాణసంచా కాలుస్తూ చిన్న పెద్ద తేడాలేకుండా ఊరేగిస్తూ కేరింతలు కొడుతూ సత్రశాల వద్ద కృష్ణానదిలో, కంభంపాడు పెద్దకాలువలో నిమజ్జనం చేసేందుకు తరలి వెళ్లారు. స్థానిక ఎర్రబాలెం కాలనీవాసులు 18వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శివపార్వతుల పుత్రుడు వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుగాలీ మహిళలు ప్రదర్శించిన నృత్యాలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎర్రబాలెం కాలనీలోని వినాయకుడి స్వామి వారి లడ్డును వేలంపాటలో బాణావత్ సైదానాయక్ రూ.33 వేలకు దక్కించుకున్నారు.

మాచర్లలో గణేష్ ఉత్సవ సందడి

మాచర్ల: పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ వార్డులలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం నుంచి పలు వార్డుల్లో తీర్థ ప్రసాదాలుంచిచారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బజారులో రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా సవేరా లాడ్జి ఎదురు ఉన్న కాంప్లెక్స్‌లో సామూహిక ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 15,16వ వార్డుల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద కూడా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో మధ్యాహ్నం నుంచి భారీ స్థాయిలో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా భారీ ఊరేగింపులు జరిపారు. నెహ్రూ నగర్ నుంచి రింగ్ వరకున్న విగ్రహాలను నిమజ్జనం చేశారు.









పట్టణంలో గణేష్ నిమజ్జన ఊరేగింపు దృశ్యాలు



వినాయక విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న దృశ్యాలు



రెంటచింతలలో కనులపండువగా వినాయకుని నిమజ్జనం యాత్ర నిర్వహిస్తున్న ఎర్రబాలెం కాలనీ వాసులు

ఘనంగా మహాకవి ఆరుద్ర జయంతి

చిలకలూరిపేటటౌన్: పట్టణంలో ఆదివారం మహాకవి ఆరుద్ర శత జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక, షేక్ లాలూ దాదాసాహెబ్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు హాజరై, ఆరుద్ర జీవితం, రచనల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరుద్ర రాసిన పాటలను పాడి వినిపించారు. ఈ సందర్భంగా హాస్టల్ గ్రంథాలయానికి రూ.వెయ్యి విలువైన 25 రకాల బాలసాహిత్య పుస్తకాలను బహుమతిగా అందజేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు, లాలూ దాదా సాహెబ్ సేవా సమితి అధ్యక్షులు షేక్ కరిముల్లా, వైఎంసీఏ అధ్యక్షుడు చుక్క విన్సెంట్ పాల్, హాస్టల్ వార్డెన్ అంకమ్మరాజు పాల్గొన్నారు.



15 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

సత్తెనపల్లి: పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు పట్టణంలోని మన్యం రెసిడెన్సీ లాడ్జిలో శనివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. లాడ్జిలోని రూమ్ నెంబర్ 307లో పేకాట ఆడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,45,670 నగదు, 21 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతోపాటు ఎస్‌ఐలు పవన్ కుమార్, శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

నకరికల్లు: సేవా కార్యక్రమాలలో పేదలను ఆదుకుంటామని గుండ్లపల్లి ఎంప్లాయిస్ హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం సభ్యులు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్‌రఫీ పిడుగురాళ్ల సున్నం మిల్లులో రాళ్లు కొట్టేపని చేస్తుండగా కంటికి తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయం తెలుసుకున్న గుండ్లపల్లి ఎంప్లాయిస్ హెల్పింగ్ హ్యాండ్స్ మానవత్వంతో ఆ కుటుంబానికి సహాయంగా నగదు, బియ్యం, కిరాణా సరుకులు అందించారు. కార్యక్రమంలో గుండ్లపల్లి ఎంప్లాయిస్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గుండు మస్తాన్‌వలి, గుత్తికొండ మహబూబ సుభాని, జమాల్ అల్లాభక్షు, కరాలపాటి సైదావలి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

యడ్లపాడు: పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. మండలంలోని వంకాయలపాడు గ్రామంలో అక్రమంగా కోత ముక్కల పందేలు ఆడుతున్నారంటూ విశ్వసనీయమైన సమాచారం అందడంతో ఎస్‌ఐ టి.శివరామకృష్ణ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో కోత ముక్కలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14,700 నగదును స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

గంగమ్మతల్లి చెరువుకు బహిరంగ వేలం

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లు పంచాయతీ పరిధిలోని గంగమ్మతల్లి చెరువులో చేపలు పట్టుకునేందుకు ఈ నెల 4వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ రమీజ్, సర్పంచ్ సీహెచ్ జయశ్రీలు ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని, పంచాయితీరాజ్ నిర్దేశించిన షరతులకు వేలం జరుగుతుందన్నారు. తుది నిర్ణయం పంచాయతీ కార్యదర్శిదేనని చెప్పారు.

జ్వర పీడితులకు హోమియో మందులు పంపిణీ

అచ్చంపేట: స్థానిక వీరభద్ర స్వామి కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు జ్వర పీడితులకు, వ్యాధులకు గురికాకుండా ముందస్తు చర్యలలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం హోమియో మందులు పంపిణీ చేశారు. కాలనీలో దోమల దాడి ఎక్కువగా ఉన్నందున చికెన్‌గున్యా, డెంగీ వంటి వ్యాధులకు గురికాకుండా ముందుస్తుగా హోమియో మందుల పంపిణీ చేస్తున్నట్లు సీపీఎం మండల నాయకులు హనుమంతరావు తెలిపారు. తామిచ్చే హోమియో పిల్స్ వారానికి రెండు చొప్పున వాడినట్లయితే విషజ్వరాల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ఆర్ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మస్తాన్ బుజ్జి సంపంగి ఏడుకొండలు, మీరసాబుడే తదితరులు పాల్గొన్నారు.

